
# బోణీ ఎద్దు



అయిదు నోట్లు!

అవి పచ్చగా ఉన్నాయి. పళపళ మంటున్నాయి– అవి చేతిలో ఉంటే లోకమే అరచేతిలో ఉంటుందన్న నమ్మకాన్ని కలిగిస్తూ. ఆనమ్మకం అవిచేతిలో ఉన్నవాడి గుండెల్లోకి దూరి... కన్నుల్లోకి ప్రాకి...పెదవుల మీదికి జారి– చిరునవ్వుల పూలు పూయిస్తూ ఉంది.

“ఒగిటీ...రొండూ...రొండున్నొక్కటి...నాలుగు...అయిదు!” ఆనోట్లను ఒకటికి రెండు సార్లుగా లెక్క పెట్టాడు– మూడంకెను పలికితే ముదనష్టమవుతుందన్న నమ్మకంతో. అప్పుడు ఆ నోట్లను ఎదుటి వ్యక్తి చేతిలో పెట్టాడు.

దుక్కులుడిగిన గొడ్డుకు అయిదు వందలు! ఇప్పుడు కొన్నవాడి మొగంలో చిరునవ్వు ఎగిరి అమ్మినవాడి మొగంలోకి దూకింది– ఒక్క పూవుమీదనుండి ఎగిరి ఇంకొక పూవుమీద వాలే సీతాకోక చిలుకలా!

బోడెద్దుకు బేరం కుదిరింది.

తూర్పున రెండు బార్ల పొద్దెక్కింది. మట్టిని నమ్ముకొన్న చెమట శరీరాలు మబ్బు తెరలను చీల్చుకొంటూ వెళ్ళి పుడమి తల్లితో పోరాటానికి తలపడ్డాయి. అయినా ఆ ఇంటి ఇద్దరు కోడండ్లు మాత్రం తమ నలుగురు బిడ్డలను బడికి పంపడానికి హడావిడిగా అటూయిటూ తిరుగుతున్నారు.

బోడెబ్బ పెద్దకొడుకు కుడిచేతిలోని అయిదుపచ్చనోట్లను దర్జాగా ఎడమ చేతిలోకి మార్చుకొన్నాడు. బోడెద్దు పగ్గాన్ని కుడిచేత్తో పట్టిచ్చాడు– అది ఏ ఇంటి గాటికో పోదని తెలిసి కూడా!

బోడెద్దు!– కాలు గీరలేదు. ఖణిల్లని రంకె వేయలేదు. కనీసం తలకూడా అడ్డంగా ఆడించలేదు. దానికి తెలుసు. ఒకడిచేతికి పగ్గంపట్టివ్వడమంటే తనమీద అధికారాన్ని వాడికి ధారాదత్తం చేసినట్లని!–

బోడెబ్బను మాత్రం ఒక్క చూపు చూసింది– అతి దీనంగా!

బోడెబ్బ!– దుక్కులుడిగిన బోడెబ్బ. ఇంటిముందర పందిరి వామికింద కుక్కి మంచానికి అతుక్కుపోయిన బోడెబ్బ! తనచెమటనే ఇల్లూవాకిలీ కయ్యా కాలవగామార్చిన బోడెబ్బ!... నోరుండీ నోరు లేని గొడ్డులా తన కండ్లెదుటే జరుగుతున్న తంతును గమనిస్తున్నాడు.

అదో అప్పుడు చూసింది బోడెద్దు!

బోడెబ్బ బోడెద్దు చూపులు ఒక్క క్షణం కలుసుకున్నాయి.

"ఈ నా కొడుకులు దుక్కులుడిగిపాయ్‌నాయని బోడెద్దును అమ్మిపారేస్తా ఉండారు. నాగ్గూడా దుక్కులుడిగిపాయ్‌నాయి. ఎవుడైనా కొనుక్కుండే యదవలుంటే నన్ను గూడా అమ్మి పారేస్తారేమో?"

బోడెబ్బ గుండె చప్పుడులో గుబులు దగ్గుగా మారింది.

దగ్గి దగ్గి ఊపిరే ఆగిపోతిందేమో అన్న స్థితిలో దయతలచినట్లు గల్ల ఊడింది. తెపరాయిస్తూ మంచం కిందికి వంగాడు. ఇసుక పోసి పెట్టిన టెంకాయ చిప్పలో కారి తుపుక్కున ఉమ్మాడు.

టీవీ ముందు కూర్చొని సిగరెట్ నుసిని చిటికెన వేలితో యాష్‌ట్రేలోకి విదిలిస్తున్నాడు– బోడెబ్బ చిన్న కొడుకు.

బోడెద్దు గడప దాటుతూ ఉంది.

"ఒరే! యదవ నాకొడకల్లారా! గాటికి గొడ్డు దొంతికి కడవ వచ్చిన యాళా విశేషం అంటారు పెద్దోళ్ళు. నిజంవే గదరా? బోడెద్దు గాట్లో కొచ్చినాకనే కదా ఈ సంసారం ఎసురు పొంగినట్టు బుసబుస ఎగబడింది. కన్నోరు. మోటగట్టు. మడక్కట్టు. బండికట్టు. ఎప్పుడైనా

మొండికేసిందా? పాలుమాలి పొణుకుణ్ణిందా? ఇన్నేండ్లు దాని కష్టం తింటిరే? ఇప్పుడు తూ బెహ! అయిదు నూర్లకు దాన్ని అమ్మి పారేస్తా ఉండారే? దాని గెతి ఏమయిపోతిందో అంత మాత్రం మీకు తెల్దా? పిడికిడు కసువు. రోన్ని కుడితినీళ్ళు. దాని మొకాన కొట్టి సచ్చినాక నన్ను పూడ్చిపెట్టినట్లు దాన్నీ పూడ్చిపెట్టుంటే దాని ఋణమైనా తీరుండుగదరా?" అని బోడెబ్బ గొంతెత్తి అరవాలనుకొన్నాడు.

గొంతు పెగల్లేదు!

ఒకవేళ పెగిలి అరిచినా అది ఎవడి చెవిలో పడదని కూడా తెలుసు. అయితే బోడెద్దుతో అనుబంధం అనుభవించిన తనకు ఒక్కడికే తెలుసు.

ఎండిపోయిన ఆ కట్టెలో ఎక్కడున్నాయో అన్ని నీళ్ళు! అవి పలపల రాలుతున్నాయి. అది ఎవరికంట్లో అయినా పడ్తే? దానికొక గూటింపు.

అందుకే చినిగి మాసికలేసిన పాతదుప్పటి కప్పుకొని మంచంలో ముడుక్కున్నాడు.

పళపళమంటున్న అయిదు పచ్చనోట్లను ఇనప్పెట్టెలో దాచిపెట్టడానికి దర్జాగా ఇంట్లోకి నడుస్తున్నాడు పెద్దకొడుకు.

"డాడీ టాటా!...మమ్మీ టాటా!" అంటూ చేతులు ఊపుతూ పిల్లలు బడికి బయలుదేరారు.

బోడెద్దు గడప దాటింది.

వాకిట్లో ఒక్క క్షణం నిలబడి రంకె వేసింది– ఇంటి తట్టు చూస్తూ.

కుక్కి మంచంలో ముడుక్కున్న బోడెబ్బ ఉలిక్కిపడి పైకి లేచాడు.

అయిదు పచ్చనోట్లను కడుపులో దాచుకొని ఇంట్లో ఇనప్పెట్టె బరువుగా మూలిగింది.

బోడెద్దు రంకె. తుఫానుగాలికి ఫెళ ఫెళా విరిగిన కొమ్మ రంపు వంటి రంకె. ఆ తాకిడికి గుండె కన్నుల్లోకి తన్నుకొని వచ్చినట్లయింది. కండ్లు కరిగిన మేఘాలయ్యాయి. అవి కురిస్తే? అది ఎవరి కంట్లో అయినా పడ్తే? లేని పోని సతాయింపు. అందుకే దుప్పటి ముసుగుదన్ని కాళ్ళెత్తి కడుపులో పెట్టుకొని కుక్కి మంచంలో ముడుక్కొన్నాడు. ఒళ్ళు ముడుక్కోమంటే ముడుక్కునింది. కానీ మనస్సు? అది పగ్గం పట్టుకుంటే వెంట నడిచే బోడెద్దు కాదు. అందుకే అది దుక్కులుడిగిన ఆ కట్టెను మంచానికి అతికించేసి గతంలోకి వెళ్ళిపోయింది!...

*   *   *   *   *

"ఒరే బోడిగా!"

"ఏం మామా?"

"అడ్డగాడ్డి మాదిర పెరిగే దానికేమో అడ్డం ఆపూ రొండూ లేకుండా పెరిగిపాయ్‌నావు. ఇట్లా అడ్డాదిడ్డం తిరుగుళ్ళు తిరిగే పనేనా? లేకుంటే..."

"ఇంక నన్నేం చెయ్‌మంటావో చెప్పు మామా? ఎవ్వరైనా పిలిస్తే కూలీ నాలికి పోతాఉండా. పిలవకపోతే అడువుల మింద పడి ఎండుకట్టె పుల్లలు ఏరుకోనొచ్చి అమ్ముకుంటా ఉండా. ఆ నాలుగుదుడ్లు తీసుకొనిపాయ్ ఆముసిలిదాని చేతుల్లోపెడ్తే యాళకంత ఉడకేసి నా మొకాన కొడ్తాఉండాది. మా యబ్బేమన్నా బూమి పుట్రా వాసాలకంగా మిగలబెట్టి పాయ్‌నాడా చేసుకోని బతికేదానికి?"

"మీ యబ్బ మిగలబెట్టేసి పోలేదని నువ్వుగూడా..."

"చేతులు ముడుసుకొని కూసుంటావుండానా? అట్టా మాదిరి కూసుంటే ఒగిటికి రెండు కడుపుల్ని ఏంజేయాల? తడిగుడ్డేసి తడిపి పెట్టాల్నా?"

"అది కాదురా నేనన్నేది. కండబలం గుండెబలం రెండూ నీకు పెట్టని సొమ్ములా. దీనికి మించి గుణబలమూ ఉండాది."

"ఉండచ్చు. ఉంటే నేనేం జెయ్యాల?"

"నా ఇంటికి అల్లుడు గావాల"

అడవిలో కట్టెలు కొట్టుకొంటూ ఉంటే ఉన్నట్లుండి చేతిలో కత్తి బంగారు కత్తిగా మారిపోతే గూడా వాడంత ఆశ్చర్య పడడేమో!

అవును బోడిగాడు!- పుట్టి బుద్దెరగక ముందే తండ్రి వాతఅంతమట్టి కొట్టాడన్న అపవాదుకు గురైన బోడిగాడు...చిర్రెంట్రుకల బోడిగాడు...దువ్వెన దూరక పోతే తల్లి పట్టుబట్టి రెండు మూడు నెలల కొకసారి బోడి కొట్టించిన బోడిగాడు...లేకలేక కలిగిన ఒక్క మగ పురుగని ముచ్చటబడి మునిశంకరుడని పేరు పెట్టుకుంటే ఆపేరును అవతలకినెట్టి వాడు కొట్టించుకొన్న బోడి గుండు వాడిని బోడిగాడుగానే నిలబెట్టింది. ఆ బోడిగాడు దాదాపు నలభై యాభై ఎకరాల భూస్వామి లోకనాధం ఇంటికి అల్లుడు కావడమంటే?...

అది కలా? నిజమా? అన్న సందేహం. అది వాస్తవం. ఆ వాస్తవాన్ని కౌగలించుకోవడానికి జీవితమే ఒక అద్భుతం నుంచి బయటపడలేక గింజుకొంటూవుంటే-

"ఒరే నాకుమాత్రం ఎవరుండారురా! ఇద్దరూ ఆడకూతుళ్ళే కదా! వాడెవుడో ముక్కూమొకం తెలవనోడి చేతల్లోపెట్టి మల్లా చేతులు పిసుక్కుండేదానికంటే అయినోడివి ఇల్లిటానికి తెచ్చుకుంటే!"

ఈ భయంకర వాస్తవాన్ని జీర్ణించుకోలేనట్టుగా బోడిగాడి తల వాలిపోయింది. కాలిబొటనవేలు మాత్రం నేలమీద పిచ్చి గీతలు గీస్తూ ఉంది.

"నిన్నేరా అడగతా ఉండేది."

"ఒకమాట అమ్మనడిగిచెప్తాను మామా."

"ఒరే యారకతినే యదవా? ఎంతదా ఆడబిడ్డల తండ్రైతే మాత్రం పిలిచి పిల్లనిస్తానంటే దీనికూడా మీ అమ్మనడగాలా?" అని దెప్పి పొడవాలనుకున్నాడు. కానీ నిజానికి వాడి మాట సంస్కారంతో ముడిపడి ఉంది.

"ఒరే బోడీ! ఈపొద్దు నీకర్మగాలి నువ్విట్టుండావు. అదే నీయబ్బ గుర్రప్పందాలమీద పడి ఇల్లూ ఒళ్ళూ గుల్లచేసుకోకుంటే నీకేమిరా? ఇంచు మించు మా ఆస్తిలో సగం గదరా నీది. అంత ఆస్తిని నోరులేని జీవాల మీద పెట్టి ఏందో వారుకుందామని ఉణ్ణిందంతా ఒగిటికి సగంగా అమ్మిపారేసె గదా? ఆ దిగులుతోనే మంచమెక్కె ఎక్కినోడు ఎక్కినట్టే ఎలబారిపాయ. అయినా తలరాతలు తప్పించేది ఎవుడితరం?"

బోడిగాడి కండ్లల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

"సరేలే మామా! అట్లానే అమ్మనొకసారి అడిగి..." అని గొణుగుతూ మామ దగ్గిర సెలవు తీసుకున్నాడు.

కూలిచేస్తే కుండకాలే బతుక్కు ఏదో ఒక గొప్ప లాటరీ తగిలినట్టు కొడుకును అదృష్టం వెదుక్కుంటూ వస్తే ఏతల్లిమాత్రం కాదంటుంది?

బోడిగాడు లోకనాథం ఇంట్లో ఇల్లిటానికి కుదురుకొన్నాడు. ఆ ఇంటి గడప తొక్కేసరికి పేరు శంకరంగా మారింది. వాడి నడవడిక మారింది. రాత్రికి పగటికి తేడే లేకుండా ఆ ఇంటికి తన చెమటను ధారపోస్తున్నాడు. అది గమనించిన ఊరు ఊరికే ఉంటుందా? ఉంటే అది ఊరెలా అవుతుంది?

"జల్మ జల్మాల ఋణం తీర్చుకుంటా ఉండాడు." అని ఒకడంటే...

"ఇంటికి కాబొయ్యే అల్లుడు గదా?" అని ఇంకొకడంటే...

"ఒరే! లోకనాథం సన్నోడేంకాదురా. ఎరను చూపించి చేపను పట్టాలనుకున్నాడు. ఈ ఎర్రోడు అది ఎరగకుండా అప్పుడే ఇంటికి అల్లుడైపోయ్‌నట్టు కులకతా ఉండాడు." అని కొందురు ఎగతాళి చేస్తుంటే– అన్నిటిని పెడచెవినిపెడ్తూ శంకరం తానేమో తన పనేమోగా కష్టపడుతున్నాడు.

చూస్తూ చూస్తూ ఉండగానే ఆరేళ్ళు గడిచిపోయాయి.

మంచి కండ పుష్టి వయసు పుష్టి మీద వున్న శంకరం భూమికి ఆకాశానికీ మధ్య కట్టిన మమతల ఉయ్యాలలో ఊగుతూ కాబోయే భార్య అందచందాలను నెమరేసు కుంటున్నాడు. ఏ క్షణాన పెళ్ళి మాట ఎత్తబోతారో అని.

మనిషి మనస్సుకు కట్టుబడని కాలం గడిచిపోతూనే ఉంది.

ఒక దినం. జాము రాత్రి కావస్తూ ఉంది. ఊరు మాటు మణిగింది. శంకరం మడికి తడేసి వచ్చి అప్పుడే గడపలో కాలు పెట్టాడు. పెట్టిన కాలు ఎత్తలేదు. గడపకు ఇటుపక్క ఒకకాలు అటుపక్క ఒకకాలుగా కదలీ మెదలకుండా నిలబడిపోయాడు.

"నీకేమన్నా పిచ్చి గిచ్చి పట్టిందా? చీ! చీ! ఈ మాట అడిగేదానికి నీకు నోరెట్లా వచ్చిందే?"

"ఒసే పిచ్చిదానా! ఆవేశానికీ ఆలోచనకూ ఎప్పుడూ చుక్కెదురేనే. ఆ ఆవేశాన్ని చల్లార్చుకో. అప్పుడు ఎరికవుతుంది నేను చెప్పినదాంట్లో నిజిమెంతుందో?"

"ఎరికాలే? బోరికాలే. ఇంకొక్కసారి నాదగ్గిరీమాటెత్తినావంటే నీకుపళ్ళే తిక్క వొదిలి పోతింది."

"తిక్క నీకా నాకా? వాడికేం అందం లేదా? సెగితిలేదా? గుణంలేదా? లేదంటే ఒక్క చదువు లేదనుకో. చదుకుణ్ణె ఎదవలంతా సక్కరంగా కాపరం చేస్తా ఉండారా?"

"నువ్వు ఆరుచెప్పు. నూరుచెప్పు. ఇట్టపుట్టేపొద్దు అట్టపుట్టనీ. పొయ్ పొయ్ నాబిడ్డ మెడలో కొంపలో సేద్దిగాడు బొట్టుకట్టేది మాత్రం నేను చచ్చినా ఒప్పుకోనంటే ఒప్పుకోను."

"నువ్వు ఒప్పుకుంటే ఎంత? ఒప్పుకోకపోతే ఎంత? నా మాటంటే మాటే?–"

గడపలో నిశ్చేష్టుడై నిలబడి శంకరం అత్తామామల వాదులాట వింటున్నాడు.

"నాన్నా! మీరిదే మాటకు కట్టుబడితే నేనే బావినో గుంటనో చూసుకుంటాను కానీ– ఈ కొంపలో సేద్యగాడి ముందు తలవంచి తాళి కట్టించుకునేది మాత్రం కల్ల. నాకేం కర్మ ఈ మోటు గాడిని మొగుడనిపించుకునే దానికి." తనగదిలో కూర్చొని ఈ వాదులాట వింటున్న లోకనాథం పెద్ద కూతురు ఒక్క ఊపులో వచ్చి తన నిర్ణయాన్ని తెగేసి చెప్పింది.

ఈడ్చి కొట్టిన చెంపదెబ్బలా గుండెకు తగిలిందామాట. గుండె చెరువయ్యింది. కండ్లు నిండుకొన్నాయి. గడపకు అవతల పెట్టిన కాలు వెనక్కు తీసుకున్నాడు శంకరం– కాదు బోడిగాడు. గిరక్కున వెనక్కు తిరిగాడు. వడిశెల రాయిలా ముందుకు దూసుకొనిపోతున్నాడు చిమ్మచీకటిని చీల్చుకుంటూ. కలలు కల్లలయ్యాయి. కట్టుకున్న పేకమేడలు కంటెదుటే నిలువునా కూలిపోయాయి. లోకమే శూన్యంగా తనకంటికి కనిపిస్తుంటే ఆ శూన్యాన్ని కౌగలించు కోవడానికన్నట్లుగా ఒక్క ఊపు మీద నడుస్తున్నాడు– ఎక్కడికి? ఎందుకు? అన్న ఆలోచన లేకుండా. దారి వెంబడికాదు. పడ్తూ లేస్తూ తాను నడిచింది దారిగా.

"ఈ మొకానికి పొయ్ లోకనాదం కూతుర్నియ్యబోతాడు. మనం చూడకుండా పోతామా?"
"ఒరే ఒరే! లోకనాదం సన్నోడేంకాదురా. ఎరను చూపించి చేపను పట్టాలనుకుణ్ణాడు." ఊళ్ళో వాళ్ళు అన్న మాటలు గునపాలతో పొడిచినట్టు గుండెలను పొడుస్తున్నాయి.

"ఆయన అన్నెట్టుగా అడ్డగాడ్డి మాదిరి ఒళ్ళు పెరిగిపొయ్యింది గానీ బుద్ధి పెరగక పొయ్యిందే? పిల్చి పిల్లనిస్తానంటే మాత్రం ఇది ఈడుగాని సావాసమని ఆలోచించాల్సిన పని ఉండాదా? లేదా? అయినా ఆ పెద్దమణిసి ఎంత బాగా నమ్మబలికె. ఆ మాటలన్నీ ఇసికలో రాసి దుత్తలో పోసినట్లాయనే. ఇంక ఈ బతుకు ఉంటే ఏం? ఊడితే ఏం?

నడకతో పోటీపడుతూ మనసు పరిపరివిధాలా పోతూఉంటే బోడిగాడు గాలికి కొట్టుకు పోతున్న ఎండుటాకులా ముందుకు దూసుకొనిపోతున్నాడు.

జాముర్రాత్రి దాటింది.

బోడిగాడు బావి గట్టున నిలబడుకున్నాడు. చిరిగిన చొక్కాలా మిగిలిన తన జీవితాన్ని తలపోసుకొని కుమిలి కుమిలి ఏడ్చాడు. కన్నీళ్ళు దుఃఖాన్ని కరిగించ గలవేమో కానీ– మనసులో కరుడు గట్టిన అవమానం? కరెంటు కమ్మిలో కరెంటు... బావిలో నీళ్ళు కరెంటు లాగినట్టు లాగుతున్నాయి.

ఎదురుగా వయసుడిగిన తల్లి రూపం!

"ఒరే నాయినా! కూసుంటే లెయ్‌లేను. లేస్తే కూసోలేను. కాలుచెయ్యి ఆడలేని ఈ వయిసులో నన్ను అన్నాయం చేసి పోతావంట్రా! వద్దురా బిడ్డా! చచ్చేంసాదిస్తావురా?" అంటూ కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఉంది.

తనకు ఈ జన్మనిచ్చిన తల్లి...తన ఆత్మలో ఒక భాగమైన తల్లి... అతల్లి కంటే ముందు తాను చస్తే?

గుండెల నుండి ఎగదన్నిన ఈ అభిప్రాయం కాళ్ళకు చేతులకు కట్టుకున్న తీవ్ర తీగల బంధాలను తునా తునకలు చేసింది. 'అమ్మా!' అని రోదిస్తూ నడక పరుగ్గా ఇల్లు చేరాడు. వాకిట్లో నిలబడ్డాడు– గసపోసుకొంటూ.

"తలుపు తడ్తే అమ్మ తడబడ్తా లేసి తలుపు తీస్తింది. తీస్తే ఆమె మొకం ఎట్టా చూడాల?" అని మల్లగుల్లాలు పడుతూనే గత్యంతరం లేక మెల్లగా తలుపు తట్టాడు.

కుక్కి మంచంలో కునుకు తీస్తున్న తల్లి అలికిడి కావడంతో "ఎవురాడ?" అనింది.

"అమ్మా!" అన్నాడు.

ఆవేళప్పుడు కొడుకు గొంతు. తడబడుతూ లేచింది. చీకటిలో తడమాడుతూ తలుపు తీసింది. తల్లిని చూసేసరికి దుఃఖం కట్టలు తెంచుకొనింది. ఆమెను కౌగలించుకొని 'బోరో' మన్నాడు.

"ఒరే నాయనా! ఏంవయ్యిందో చెప్పరా? ఎందుకురా అట్టా ఎక్కిళ్ళుపెట్టి ఎక్కిళ్ళుపెట్టి యాడస్తావ్? చెప్పరా బిడ్డా! నాతో చెప్పరా!" అని అడుగుతూ ఉంటే వణుకుతున్న చేతులు ఆమె గుండె తీవ్రతని తన తల కెక్కిస్తున్నాయి.

బోడిగాడు ఏమని చెప్తాడు?

"నమ్మి నానబోసుకుంటే పుచ్చి బుర్రలాయె గదమ్మా?" అని ఎలా చెప్తాడు.

* * * * *

పొద్దు నడిమిట్టకు వస్తూ ఉంది.

వీధిలో ఒకఎద్దు కాలుగీరి ఖణిల్లని రంకెవేసింది.

బోడెబ్బ ఆఎద్దురంకెతో ఉలిక్కిపడ్డాడు. ఎప్పుడో గతంలోకి వెళ్ళిపోయిన మనస్సు మరలా ఆకట్టలో వచ్చిపడింది. అది బోడెద్దు రంకేమో అన్న భ్రమ. లేచి కూర్చున్నాడు. ఆశగా కలయచూశాడు.

బోడెద్దు కనిపించలేదు!

గతంలో అనుభవానికొచ్చిన చేదు అనుభూతితో బోడెబ్బకు ఒళ్ళంతా చెమటలు పట్టాయి. మొలకు చుట్టుకొన్న పంచనే కొంచెం పైకి లాక్కొని వొంటికి పట్టిన చెమటను తుడుచుకుంటూ "రోన్ని మంచి నీళ్ళీయండమ్మా!... మంచినీళ్ళు!" అని అడిగాడు– గొంతు తడారిపోతుంటే.

బోడెబ్బ బోసినోటినుండి మంద్రస్థాయిలో వెలువడిన మాట గాలిలో కలిసిపోయింది!

నాలుకపిడచ గట్టుకపోతూ ఉంది. లేచి మంచినీళ్ళు తెచ్చుకొనే ఓపికలేదు. ఓపికచేసుకున్నా "ఈకొంపలో ఇంతమంది చచ్చిఉండాం గదా? అడిగితే అన్ని నీళ్ళే తెచ్చికొట్లేకపాయ్‌నామా? ఈ వయస్సులో యాడన్నా జారిపడి కాలో చెయ్యో యించుకుంటే ఈడెవురుండారు చేసే దానికి?" అని యాష్టను చేటలకెత్తి చెరిగి పోస్తారు. అందుకే లేని తెంపు తెచ్చుకొని కొంచెం గొంతు పెంచి "రోన్ని మంచినీళ్ళు దెచ్చి నా మొకాన కొట్టండమ్మా!" అని అరిచాడు.

"చీచీ! ముసిలి పీనిగె. ఎప్పుడూ ఏదో ఒక సొణుగుడు. ఈ పీడ ఎప్పుడు విరగడవుతుందో ఏంపాడో?" అని గొణుక్కుంటూ టీవీముందు కూర్చున్న చిన్న కోడలు లేచి విసవిస వంటింట్లోకి నడిచింది. చెంబుడు నీళ్ళుతెచ్చి మంచం పక్కనే ఉన్న చెంబులో పోసింది– బాగా పైకెత్తి ఆ చెంబును తాకితే మైల పడుతుందేమో అన్న చీదరింపుగా.

కోడలు నడకలో విసురు...ఆ ముఖంలో ఏవగింపు...ఆమె చెంబు పైకెత్తి పోసినతీరు... బోడెబ్బ గుండెల్ని తొలిచాయి. అయినా ఏంచేస్తాడు?–

కోడండ్లంటే తెచ్చుకొన్నవాళ్ళు. వాళ్ళ నడవడిక అంతకంటే వేరుగా ఎలా ఉంటుంది? అయితే కడుపునపుట్టిన కొడుకులు?– తన చెమటనే తమరక్తంగా మార్చుకొన్న స్వార్థులు!... చదివించి ప్రయోజకులను చేయాలని రెక్కలు ముక్కలు చేసుకొన్నవాడు, ఇంకా బతికే ఉన్నాడని... వాడికి కసీసం తిండి తిప్పలైనా సరిగా అమరుతున్నాయా? లేదా? చూడాలన్న ఇంగిత జ్ఞానం లేని వెధవలు? ఇంక వాళ్ళ చదువులెందుకు? చట్టుబండలెందుకు?–

కోడండ్లిట్లా. కొడుకులట్లా. పోనీ వాళ్ళకు పుట్టిన బిడ్డలు?–

ఒకదినం ఆపిల్లలు ఆడుకుంటున్నారు. వాళ్ళు ఆడుకొంటున్న బంతి తనమంచం కిందికొచ్చి పడింది. దాన్ని తీసుకోవాలి. "ఒరే! ఆ ముసిలోడి దగ్గర చచ్చే నీచు కంపు. నేను పోను. నువ్వుపోరే!" అని ఒకడంటే, "నీకు నీచుకంపు కొడ్తే నాకు కొట్టదో?" అని ఇంకొకడు.

హుఁ! నీచు కంపు కాకుండా మంచి వాసనలు రావడానికి తనకేమన్నా పన్నీటి స్నానం చేయిస్తున్నారా? కనీసం ఉతికిన బట్టయినా కట్టబెట్తున్నారా? అని నిట్టూరుస్తూ తానే లేచి మంచం కిందికి వొంగి ఆ బంతినెత్తి వాళ్ళున్న తావుకు విసిరేశాడు.

వాళ్ళ మొగాల్లో ఎంత ఆనందమో!

ఈ పిల్లలేనా ఆ పిల్లలు?

మామిడి తోపులో చెట్లల్లోనే కలమాగిన మామిడి పండ్లను ఒక బుట్టకు మోసితెస్తే 'తాతా! తాతా!' అంటూ పైకి ఎగబడిన వాళ్ళు...పడుకుంటే ఎదమీద పడి ఆడుకొంటూ కొళాయి తిప్పేసినవాళ్ళు...

నాభి నుండి వెలువడిన నిట్టూర్పుకు ఓదార్పు ఎక్కడుంది?– ఓదార్చ గలిగిన మనిషి తనకంటే ముందుగా వెళ్ళిపోయి పుణ్యాత్మురాలనిపించుకొనింది. అప్పుడు చూపు చెంబు మీద పడింది. చెంబు చేతికి తీసుకొన్నాడు. ఆ చెంబుడు నీళ్ళు తాగాలనిపించినా సగం మాత్రమే తాగి సగం మిగలబెట్టుకొన్నాడు– మరలా నీళ్ళు కావాలంటే మండిపడతారని!

తొలకరి చినుక్కు తువ్వనేల పులకరించినట్టు తడారిన గొంతుగుండా రొండు మూడు గుక్కలు నీళ్ళు జారే కుందికి మనస్సు కాసంత స్థిమితపడింది.

"ఒకప్పుడు వీళ్ళందురూ నా మింద ఆధారపడి బతికినోళ్ళే. ఈ పొద్దు నేను ఈళ్ళ మింద ఆధారపడే కుందికి నా బతుకు యాడికొచ్చింది. గుక్కడు నీళ్ళక్కూడా గుణిసే గెతి పట్టింది– ఏం జల్మమో? పాడు జల్మం." అనుకొనేసరికి బోడెబ్బకు ఎప్పుడో ఆ ఊళ్ళో హరిదాసు చెప్పిన కథ గుర్తుకొచ్చింది.

బ్రహ్మ సకల జీవరాసులకు ఆయుర్దాయం నలభై సంవత్సరాలుగా నిర్ణయించాడట. 'అయ్యో! అలా తిరిగి చూసే కుందికి కరిగిపోతుందే' అని మనిషి మథనపడి మరికొంత ఆయుర్దాయాన్ని పెంచమని బ్రహ్మను అర్థించాడట. అప్పుడు ఒక గాడిద, కుక్క, గుడ్లగూబ అక్కడికి వచ్చాయట. "స్వామీ! స్వార్థపైన ఈ మనిషికి నలభై ఏండ్ల చాకిరీ? మావల్లకాదు. అందులో సగం చాలు' అని కోరాయట. బ్రహ్మ సరే అని మూడు జీవుల సగం సగం ఆయుర్దాయాన్ని మనిషి పరంచేశాడట.

నిండు నూరేండ్లజీవితం తనకు లభించిందని మనిషి ఉప్పొంగి పోయాడట.

ఉప్పొంగి పోతే పోయాడుకానీ తన జీవితం నలభై నుండి అరవై దాకా గాడిదలా, అరవైనుండి ఎనభై ఏండ్ల వరకు కుక్కలా, ఎనభైనుండి నూరేళ్ళ వరకు గుడ్లగూబలా కొనసాగుతున్నదని మాత్రం గ్రహించలేక పోతున్నాడట.

ఈ కథ మనస్సులో మెదిలే కుందికి బోడెబ్బ "కల్పించి చెప్పిన కతగానే ఉండచ్చు. అయినా మణిసి బతుక్కు అతికించినట్టుగా ఎంతబాగా సరిపోతా ఉండాది గదా?" అని ఆలోచించుకుంటూ తనలో తాను నవ్వుకున్నాడు– ఈ గుడ్లగూబ జీవితానికి అంతమెప్పుడో అని!

"హూఁ! కొళాయి అట్టాగాకుండా ఇట్ట తిప్పితే వచ్చే నీళ్ళు. ఆ నీళ్ళుదెచ్చి అన్ని గొంతులో పోసేదానికి ఈళ్ళిట్టా యాష్టపడిపోతా ఉండారే? కావిడి గట్టుకొని బుజాలు కాయలు కాసేటట్టు

నేను ఎన్ని నీళ్ళు మోస్తే ఈళ్ళంతా ఈ పొద్దు ఇట్టా కాలిమింద కాలేసుకొని బతకతా ఉండారు. ఈ మాత్రం ఆలోచించలేకపోతా ఉండారే ఈ ఎరిముండలు?" అని కాయలు కాచిన బుజాన్ని తడుముకొంటూ ఆలోచించే సరికి అతని మనస్సు అతనికి తెలియకనే గతంలోకి వెళ్ళి పోయింది- కుక్కి మంచంలో బోడెబ్బను చలనంలేని కట్టెలా పడుండమని!...

* * * * *

వేలువిడిచిన మేనమామ... ఇల్లరికం అల్లుణ్ణి చేసుకుంటానని మాటిచ్చి 'పోరా!' అని తన నోటితో అనకుండానే ఇంటినుండి వెళ్ళగొట్టే పరిస్థితి కల్పించాడు. బతుకు వీధుల పాలయ్యింది. ఆ వీధుల్లో తలెత్తుకొని తిరగలేని పరిస్థితి ఏర్పడింది. ఎవరెవరు ఎన్నెన్ని విధాలా ఎగతాళి చేసినా చిరునవ్వే సమాధానంగా. 'అదురుష్టమంతుణ్ణి ఎవుడూ చెడపలేడు. దురదృష్ట మంతుణ్ణి ఎవుడూ బాగ చెయ్యలేడు.' అని సమాధానపడ్డాడు బోడిగాడు. ఈ కర్మ భూమిలో నిస్సహాయతనుండి పుట్టేవేదాంతం ఏమనిషికైనా ఒకపెద్ద ఊరడింపేమో!

అయినా ఊరు ఊరుకోలేదు!

ఊరి న్యాయం ఒకటి ఉంది కదా? మద్దిస్తం పెట్టించింది ఒక నాటి జామురాత్రి వేళలో.

"నన్నేంచెయ్మంటారో మీరే చెప్పండి. నేను మాటిచ్చింది నిజిమే. వాడి మింద నేనెన్ని ఆశలు పెట్టుకున్నానో? ఆ దేముడి కొక్కడికే తెల్సు. ఎంత చెప్పినా ఆ బిడ్డ చచ్చినా ఒప్పుకోనని సతాయిస్తా ఉంటే?"

"అది సరేనయ్యా! ఈ పొద్దడిగిన మాట ఆపొద్దే అడిగుంటే?"

"కడుపులో పుట్టిన బిడ్డ నా మాటకు అడ్డం చెప్పదనుకుంటి."

"నువ్వు అబ్బాగా అట్టనుకున్నావ్. ఆ బిడ్డే ఈ పొద్దు కాదంటాఉండాది. వాడొక మోటుగాడు కాబట్టి సరిపాయ. అదే ఇంకొక డింకొకడైతే?"

"అందుకే గదా ఈపొద్దిటికీ తలెత్తి వాడి మొకం చూడాలంటే_"

"నువ్వు చెప్తా ఉండేది ఇనేదానికి శానా బాగుండాదయ్యా! అయితే ఈ పొద్దు వాడిగెతి ఏమాయ! ఈదులపాలాయ!"

"చెప్పండి. నన్నేం చేయమంటారో మీరే చెప్పండి.

"కష్టం చేసింది వాడు. చెయ్పించుకునింది నువ్వు. నువ్వేదైనా చెప్తే 'ఇది నాయంగా ఉండాది. ఇది లేదు.' అని ఊరి పెద్దమణుసులుగా చెప్పగలగతాం కానీ..."

"సరే! ఊరికి ఉత్తరంగా ఉండాది కదా పదెకరాల చేను. దాన్ని వాడిపేర రానిచ్చేస్తా."

విరగబడి నవ్వింది రచ్చబండ!

"నువ్వే గాలికాదిలేస్తే దాంట్లో ఈపొద్దు తొండ్లుగుడ్లు పెట్టాఉండాయి. ఈ తలమాసినోడికి దాన్ని తగలకట్టే?..."

"ఉండేది చేసుకుంటే చాలు గదా? అని యిడ్సి పెట్టేసిన మాట నిజమే. అరువు చేస్తే అది సవర మట్టా నేల గదా! వాణ్ణి రాయీ రప్పా ఏరిపించేసి చెట్టూ చేమా కొట్టేయమనండి. ట్రాక్టర్తో దాన్ని దున్ని చదరం చేపిస్తా. ఏడాదికి అయిదు నూర్లు లెక్కన ఆరేండ్లకు మూడు వేలు దుడ్లు చేతికిస్తా."

రచ్చబండవద్ద న్యాయం నాలుగుపాదాల మీద నడిచింది.

గ్రామన్యాయం తృప్తిగా నిట్టూర్చింది.

బోడిగాడి జీవితం ఒకమలుపు తిరిగింది.

తనది అన్నభావన మనిషిమనసులోపడ్తే అప్పుడు బాధ్యత మనిషిని దారిపట్టి ముందుకు నడిపిస్తుంది. పార తట్ట కత్తి చేత పట్టుకొని బోడిగాడు పదెకరాల తనచేనిముందు నిలబడ్డాడు.

రాళ్ళూ రప్పలు... ఏపుగా పెరిగిన రకరకాల చెట్లు .... ముండ్ల పొదలు... పెద్ద పెద్ద చీకి పొదలు... ఇసుకతేలిన సన్నసన్న పిల్లకాలువలతో ఆచేను ఒకచిన్న అడవిని తలపింపచేస్తూ ఉంది. దాన్ని సాగు యోగ్యం చేస్తే?–

మట్టి మనిషికడుపు కొట్టదని వాడికి తెలుసు!

పారా తట్ట పక్కన పెట్టాడు. కత్తి చేతికెత్తుకున్నాడు. చిన్న అడవి వంటి చేని మీద పడ్డాడు. ఏపుగా పెరిగిన చెట్లు ఫెళ ఫెళా విరిగి నేలకొరుగుతున్నాయి. చీకి పొదలు చిట్టిపొట్టి పొదలు వాడికత్తికి బదులు చెప్పలేకుండా బాధ వెలపోసుకోవడానికి ఒకదాన్నొకటి కౌగలించుకొన్నట్లుగా కుప్పలు కుప్పలవుతున్నాయి. ఏదో సాధించాలన్న వాడి పట్టుదల పగటికి రాత్రికి భేదం తెలియకుండా చేసింది. అది గమనించిన తల్లి–

"ఒరే నాయనా! వాడా యదవ మాటలు నమ్ముకోని ఆరేండ్లు వాడి కొంపకు గొడ్డు చాకిరీ చేస్తే ఏం మిగిలె? ఇప్పుడీ పోరంబోకు నేలతో పోరకలాడ్తే మాత్రం ఏం మిగిలి మిట్టన పడబోతింది రా! నా కన్న తండ్రీ!" అని వాపోయింది.

"అమ్మా! మణిసి ఎదుటి మణిసి కడుపు కొట్టే మట్టి కడుపు కంత పెట్టిందే." అని తల్లిని ఓదార్చుతూ బోడిగాడు రెండు మూడు నెలలు వంచిన నడుం ఎత్తకుండా పోరకలాడ్తే అదీ ఒక చేనేమో అన్నరూపానికి వచ్చింది.

అప్పుడు లోకనాథం తాను గ్రామానికి ఇచ్చిన మాట ప్రకారం ట్రాక్టర్‌తో దున్ని చదరం చేయించాడు.

బోడిగాడు కష్టానికి ఫలితం పదెకరాలచేను వాడి భావిజీవిత నిర్మాణానికి వేసిన కడగాలుగా కనిపిస్తే ఉజ్జ్వల భవిష్యత్తు వాడికన్నుల్లో వికసించింది.

అప్పుడు బాడుగ బండ్లు పెట్టి మక్కెర్లు మక్కెర్లుగా ఎరువు తోలించాడు. చేనిమీద దట్టంగా ఒక వరస చల్లించాడు. కూలి మడకలు పెట్టి తిరుగుచాలు తోలించాడు. వేరుశెనగ పంటకు అరువు చేయించాడు.

సీమలో వెలిపైర్లు వర్షంమీదనే ఆధారపడ్డాయి. అందుకే తొలకరి చినుకుకై ఎదురుచూస్తూ చేతులు ముడుచుకొని కూర్చొనే స్వభావం కాదు కాబట్టి కూలికిపోతున్నాడు!–

ఆ సంవత్సరం తొలకరి సకాలంలోనే ప్రారంభమయింది. బోడిగాడు వేరుశెనగ విత్తనాలు కొన్నాడు. కూలిమడకలుపెట్టి దున్నించాడు. విత్తనాలు వేశాడు.

సీమరైతును మోసంచెయ్యడమే తనపనిగా పెట్టుకొన్న వాన ఆఏడాది కనికరించింది. బోడిగాడికి ముప్పావు మువ్వీసం పంట చేతికందింది.

ఏక చదరంగా పదెకరాల చేను...చేతిలో నాలుగు దుడ్లు.. ఒంట్లో శక్తి!– పేరు బోడిగాడైనా వాడి ఆలోచన బోడిగా లేదు. పదెకరాల చేనులో మంచిజాతి మామిడిచెట్లు పెడితే? అవి అయిదారేండ్లల్లో కాపుకొస్తాయి. ఈ అయిదారేండ్లు వాటిని కాపాడుకొంటే అవి జీవితాంతం తన్ను కాపాడతాయి. ఈ అయిదారేండ్లలో వేరుసెనగ పంట పెట్టుకోవడానికి ఏ ఇబ్బందీ ఉండదు కూడా!

అంతే! గడ్డపార చేతికందుకున్నాడు. మామిడి మొక్కలు నాటడానికి అనువైన గుంతలు తవ్వాడు. మంచి జాతి మామిడి చెట్లు కొన్నాడు. ఆ మొక్కలను పదెకరాల చేనులో నాటాడు. కావిడి గట్టుకొన్నాడు. ఊరిముందర గుంట నుండి నీళ్ళు మోసి మోసి ఆ మొక్కలకు పోస్తున్నాడు.

వాడి ముందుచూపును గమనించిన ఊరు ముక్కుమీద వేలేసుకొనింది.

కష్టానికి తగినఫలితం చేతికందుతున్నప్పుడు మనిషికొక గొప్పసంతృప్తి గదా? తృప్తిలో ఉత్సాహం. వాడికాలు నిలిచినచోట నిలవటంలేదు.

కాడెద్దులు కొన్నాడు. మడక కాడిమాను తయారుచేయించుకొన్నాడు. ఒక పక్క కావడి భుజానికెత్తి మామిడి మొక్కలకు పోస్తూనే ఇంకొక పక్క మడకకట్టి దుక్కిదున్ని వేరుశెనగ పంటకు చేను అరువు చేస్తున్నాడు.

అంతకు మునుపు చుట్టపు చూపుగా వచ్చే చినుకులు– ఆరోజు మాత్రం రెండు మూడు పదున్ల వాన పడింది. అదనుకు పదునుపడ్తే రైతుఆనందానికి తొలకరిచినుకే సాక్షి!

చేను రెండుమూడు చాళ్ళు దున్నించాడు. ఎరువు చల్లించాడు. విత్తనం వేశాడు.

సీమరైతు నోట్లో మట్టి గొట్టడమే పనిగా పెట్టుకొన్న వాన ఆ ఏడాది కూడా దయ తల్చింది. బోడిగాడికి ముక్కాలు పంటకు పైగా చేతికందింది. అయితే ఆ ఆనందంలో అపస్వరం లాగా కాడెద్దులో ఒక ఎద్దు విషపు కర్ర మేసి పుర్రుబారి చచ్చింది. అప్పుడు ఊరూరు తిరిగి ఒంటెద్దు జతకు జోడెద్దును పట్టుకొచ్చాడు. అదే బోడెద్దు!

బోడెద్దు గడపలో కాలు పెట్టింది.

ఊరిముందర ఐదెకరాల నంజ. ఊరి వెల్లువ పారిపారి మంచిసత్తువమీద ఉంది. బంగారు పండేనేల. బేరానికొస్తే బోడిగాడు కొన్నాడు.

బోదెద్దు గాటికొచ్చిన వేళా విశేషం అనింది ఊరు.

బోడిగాడిప్పుడు బోదెబ్బ అయ్యాడు.

గాటికి గొడ్డు వచ్చింది. ఇక ఇంటికి ఇల్లాలే!

ఆ పల్లెలో 'నా బిడ్డను కట్టుకో! నా బిడ్డను కట్టుకో!' అని ఎందరో వెంటబడితే బోదెబ్బ ఈడుగాని సావాసాల జోలికి పోలేదు. ఈడు జోడు చూసుకొని ఓ పేదింటి అమ్మాయి మెడలో తాళికట్టాడు.

మామిడి తోపు విరగబూసింది. కాసింది!

ఇంటికి ఇల్లాలు వచ్చిన వేళా విశేషం అనింది ఊరు. అప్పుడు బోదెబ్బ! –బోదెద్దు ముక్కు తాడుపట్టి మూతిని పైకెత్తాడు. మూతిలో మూతిపెట్టి మూద్దులాడాడు.

"దాన్నే కట్టుకోలేకపాయ్‌నావా" అని కిలకిలా నవ్వింది పెండ్లాం.

"ఒసే పిచ్చిదానా! అది గడపలో కాలు పెట్నాకనే కదా నువ్వు కాలు పెట్టింది. అదొచ్చిన వేళావిశేషం. ఐదెకరాల నేల కొంటి. నిన్ను ఇంటికి తెచ్చుకుంటి. అందుకే తొలి ముద్దు దానికి! ఇంక ముద్దులన్నీ నీకేలే!" అన్నాడు గలగలా నవ్వుతూ.

"ఎవురికి కావాల నీ ఎంగిలి ముద్దు?" అంటూ మూతి ముప్పైఆరు వంకర్లుగా తిప్పుతూ చిలిపిగా చూసింది కొత్తపెండ్లి కూతురు.

బోదెద్దు ఉరిమురిమి చూసింది కొత్తపెండ్లి కూతుర్ని!

బోదెబ్బ దాని గంగడోలు నిమురుతూ "పిచ్చిపిల్ల! దానికేం తెల్సులేరా బోడీ!" అని అంటే ఔనన్నట్లుగా అది తల ఆడించింది.

ఈ అనుబంధం ఒక్కొక్క సంఘటనతో విడదీయలేని బంధంగా బలపడుతూ వచ్చింది.

ఆ పల్లెల్లో మారుబేరగాళ్ళు బెల్లం, చింతపండు, వేరుశెనగ ఆయా పంట కాలాల్లో కొనుగోలు చేస్తారు. రెండెద్దుల బండ్లమీద అందుబాటులో ఉన్న టౌనుకు తోలిస్తుంటారు. మంచి బాడుగ గిట్టుబాటవుతుంది. దీన్ని గమనించిన బోదెబ్బ ఆ బాడుగ తోలడం కోసరం ఒక బండి చేయించాడు. బాడుగ దొరికినపుడు టౌనుకు బండి కదుతున్నాడు.

టౌనుకు పల్లెకు మధ్యదూరం దాదాపు ఇరవై మైళ్ళు. ఆ టౌనుకు వెళ్ళేటప్పుడైనా తిరిగి వచ్చేటప్పుడైనా ముందు బండి తనదే!

ఒకసారి పడమట నాలుగు బార్ల పొద్దుండగా టౌన్లో తిరుగు ప్రయాణానికి బండ్లు కట్టారు. ముందు బండిలో బోదెబ్బ ఉన్నాడు కదా! అని వెనక బండ్లల్లో వాళ్ళందరు బండ్లల్లోనే పడకవేశారు. బోదెబ్బ కూడా మనిషే! పాలుమాలినట్లుగా అలా పడుకొన్నాడు. బాగా నిద్రపట్టేసింది. ఎంతసేపు నిద్రపోయాడో తనకే తెలియదు. బోదెద్దు రంకెతో ఎగిరిపడి లేచాడు.

బండి ఇంటిముందర నిలబడి ఉంది!

ఇంకొకసారి ఊరి దగ్గర మడిలో వరి నాటించాలను కొన్నాడు. వరిపైరుకు ఆకు ఎరువు మంచి సత్తువ. కూలి మనుషులు అడవి మీద పడి తంగేడు, బందార, కొమ్మి వగైరా ఆకు కోశారు. ఒక్కొక్క మోపు సందెడు లావుతో నిలువెత్తు పొడవుగట్టారు. బోడెబ్బ అటువంటి ముప్పైనలభై మోపులను బండికి భర్తీ చేశాడు. భర్తీ బండి సుమారు పాటి వామిలా కనిపిస్తూ ఉంది. బండికి ఎద్దులను కట్టాడు. కొండదడి. చాలా ఏటవాలుగా ఉంది. నొగమీద కూర్చొని కాళ్ళు కాడిమానికి తన్నుకొని పగ్గాలు బిగబట్టి బండిని మెల్లగా ముందుకు నడిపిస్తున్నాడు. ఉన్నట్లుండి బోడెద్దు మెడలో పలుపు జారిపోయింది. ఇంకేముంది? బోడెద్దు మెడమీద నుండి కాడి జారి నేలమీద పడుతుంది. భర్తీ బండి ఒక పక్కకు వొరిగి తలకిందులవుతుంది. భర్తీ బండి కింద తాను. మెడపలుపు గొంతుకు బిగుసుకుంటే పైకి లేచిన కాడిమానికి వేలాడుతూ దాపటెద్దు!–

బోడెబ్బ గుండెలు ఆవటించాయి.

అయితే బోడెద్దు చాలా చాకచక్యంగా కాడిమానును బోడి కొమ్ముల సందులో ఇరికించు కొనింది. మోరపైకిలేపి కాళ్ళు నిగడదన్ని అడుగు మీద అడుగ్గా బండిని కొండదడి దాటించింది.

చెప్పాలంటే ఇలా ఎన్ని సంఘటనలో–

నోరులేని ఆ గొడ్డుతో తన అనుబంధం ఒక ఆత్మీయతగా మారింది. ఆ ఆత్మ బంధువు తాను వేళకంతగా విదిలించిన కసువు తిని కుడితి నీళ్ళుతాగి తన శక్తినంతా ఈ కుటుంబం కోసరం ధారపోసింది– తనలాగే! అయితే దాని బతుకేమయింది?

ఒక గడపదాటి తన గాటికొచ్చిన గొడ్డు తన గడపదాటి ఇంకొక గాటికి కాదు– ఎక్కడికి పోయింది? వల్లకాటికి! పోతే అక్కడేమయింది. దాని తలా మొండెం రెండూ రెండుగా తెగనరికారు. చర్మాన్ని వొలిచారు. అస్తి పంజరాన్ని తలకిందులుగా వేలాడగట్టారు. ఏ భాగానికాభాగంగా విడివిడిగా నరుకుతున్నారు.

"అయ్యో బోడీ!" అంటూ అరిచాడు బోడెబ్బ.

ఆ అరుపుతో బోడెబ్బ ఈ లోకంలో పడ్డాడు. ఊహల్లోకి వచ్చిన బోడెద్దు దృశ్యం కండ్లలో నీటి చుక్కలా తళుక్కుమంటూనే ఉంది. శరీరం గగుర్పొడిచింది. వెన్నెముకలో వణుకుపుట్టింది. నోరెండక పోతూ ఉంది. "అమ్మా! రోన్ని మంచినీళ్ళు" అని అరవాలనుకున్నాడు. అయితే అంతకు ముందే చెంబులో మిగుల్చుకున్న నీళ్ళు గుర్తుకొచ్చాయి. మెల్లిగా లేచి కూర్చున్నాడు. వొంగలేకవొంగి చెంబుచేతికి తీసుకొన్నాడు. చేయి అదురుతూ ఉంది. నీళ్ళు చింది పోతాయేమో అని చెంబును రెండు చేతుల్లో పొదివి పట్టుకున్నాడు. అయినా చెంబు అదురుతూనే ఉంది. అదురుతున్న చెంబుకు నోటికి మధ్య ఎంత దూరం? బతుకు గమ్యం చేరుకోవడానికి

ఊహించలేనంత దూరాన్ని అవలీలగా జయించిన బోడెబ్బ ఆ కొంత దూరాన్ని జయించలేని నిస్సహాయస్థితిలో!...

గుండె బాధగా మూలిగింది.

అయితే ఎండకపోతున్న నోరు ఎంతోకొంత శక్తిని ఆ చేతుల్లోకి చొప్పిస్తే చెంబు మెల్లగా పైకి లేచింది. గుటగుట నీళ్ళుతాగాడు!–

అక్కు ఎండకపోతున్నదని అలమటించినా కాసిన్ని పచ్చిమంచినీళ్ళుతెచ్చి గొంతులోపోసే దిక్కులేకుండా పోయిందే! అని వాపోతూ– బోడెబ్బ కావిడి మోసి మోసి బుజాన కాసిన కాయను ఒక్కసారి తడిమి చూసుకున్నాడు.

ఒక్క నిట్టూర్పు!

నాభిని చీల్చుకొని వచ్చిన ఆ నిట్టూర్పు వివరణలు విశ్లేషణలకు లొంగని ఒడిదుడుకుల జీవితానుభవానికి సంకేతం.

ఒక్క తన బతుకే కాదు– దుక్కులుడిగిన వయసులో దాదాపు అందరి బతుకులు ఇంతే! ఈ సంగతి మనిషికి తెలియదా? తెలుసు. తెలిసీ తాపత్రయమనే బురద తొక్కుతున్నాడట తన పరంపరాగత స్వభావాన్ని మార్చుకోలేక. అదే చిత్రం. ఆ చిత్రమే ఒక జీవితం!

హుఁ! ఎంత హీనమైపోయింది తన జీవితం? ఆలోచిస్తే నిజంగా బోడెద్దు కంటే కూడా హీనమైపోయింది.

అవును! తనకంటే ఆ నోరులేని గొడ్డే నయం. పోతూ పోతూ అయిదు నూర్లన్నా ఆ ఇంటి ఇనప్పెట్టెకి చేర్చింది.

అదే తాను పోతే?– అనవసరమైన శ్రమ!...వృధా ఖర్చు!!–

ఆ మీదట ఆలోచించలేకపోయాడు బోడెబ్బ.

బోడెబ్బ!– దుక్కులుడిగిన బోడెబ్బ!... దిక్కుండీ దిక్కులేని పక్షిలా.... మట్టిని కరుచుకొని నిట్టూర్చే బూడిద కుప్పలా మంచానికి అతుక్కొని...ఎగదన్నుకొస్తున్న కన్నీటిని ఎంత ప్రయత్నించినా ఆపుకోలేక సతమతమవుతూ...ఇష్టంగానో అయిష్టంగానో నిస్సారమయిన బతుకులోకి నిస్సహాయంగా కూరుకొనిపోతూ!... ●

స్వాతి మాసపత్రిక
(1, మే 1999)